క్లుప్తంగా

బీవోఐ జోనల్ డిప్యూటీ మేనేజర్‌కు సన్మానం



సత్కరిస్తున్న స్వర్ణకారుల సంఘం సభ్యులు

బీచ్‌రోడ్డు: ముద్ర లోన్లను అధిక మొత్తంలో మంజూరు చేసి, స్వర్ణకారుల అభివృద్ధికి బ్యాంకు ఆఫ్ ఇండియా(బీవోఐ) విశాఖపట్నం జోనల్ డిప్యూటీ మేనేజర్ జేజేశ్వరరావు విశేషంగా కృషి చేశారని స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణు మాధవ్ తెలిపారు. బదిలీపై ఇండోర్ వెళ్తున్న ఆయనను సంఘం సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడుతూ జోనల్ డిప్యూటీ మేనేజర్ సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు ముదపాక రవి, ప్రధాన కార్యదర్శి పెదపూడి బ్రహ్మాజీ, కోశాధికారి ఈర్ని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

25న ఏపీ ఐపీఆర్ చాంపియన్స్ క్విజ్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రపంచ మేధో హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25న క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకులు డాక్టర్ హెచ్.పురుషోత్తం తెలిపారు. డీపీఐఐటీ–ఐపీఆర్‌చైర్, సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(ఏయూ) ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్ విధానంలో ఈ క్విజ్ పోటీలు జరుగుతాయని, పూర్తి వివరాలను ఏయూ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9599229217 అనే ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు. విజేతలకు ఈ నెల 26న నిర్వహించే ప్రపంచ మేధో హక్కుల దినోత్సవం కార్యక్రమంలో బహుమతులను అందిస్తామన్నారు.

ముగిసిన ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ కోర్సు శిక్షణ

ఆరిలోవ: ఇండియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ సిబ్బందికి ఫుడ్‌క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్‌లో 14 వారాల పాటు నిర్వహించిన ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ కోర్సు శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏయూ స్కూల్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అనుబంధ విభాగం ప్రొఫెసర్ ఉజ్వల్ కుమార ఘటక్, ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ రమణ, అధ్యాపకులు కోర్సులో శిక్షణ పొందిన 42 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. హోటల్ ఫ్రంట్ ఆఫీస్ మేనేజ్‌మెంట్‌లో మెలకువలు, కోర్సు వల్ల ఉపయోగాలు గురించి వివరించారు. శిక్షణ పొందిన ఇండియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

హోం ఓటింగ్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

బీచ్‌రోడ్డు: ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యేవారంతా హోం ఓటింగ్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని తూర్పు నియోజకవర్గం ఆర్వో, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. తూర్పు పరిధిలో విధులు నిర్వర్తించనున్న సెక్టోరల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, బీఎల్వోలకు స్థానిక వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఓటింగ్ విధానంపై నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడం, హోం ఓటింగ్ విధానం, ఇతర ప్రక్రియలపై అనుసరించాల్సిన విధానలపై ఆయన మార్గనిర్దేశం చేశారు.

మద్యం స్వాధీనం

బీచ్‌రోడ్డు: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని మూడో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిరిపురం వద్ద సాయి నాయుడు అనే వ్యక్తి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు వెంబడించి పట్టుకున్నారు. అతని వద్ద గల గోనె సంచిలో నాలుగు బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

ప్రజల హృదయాల్లో సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ
- జగనన్నతోనే విశాఖ భవిష్యత్: ఎంవీవీ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీవీ



బొత్స ఝాన్సీ, ఎంవీవీలను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



సమావేశానికి హాజరైన స్థానిక ప్రజలు

ఎంవీపీకాలనీ: ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచారని వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 17వ వార్డులో వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య అధ్యక్షతన మేము సిద్ధం – మా బూత్ సిద్ధం పేరిట 17వ వార్డులోని దళివారి వీధిలో శుక్రవారం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. ఈ ఎన్నికలు పేద వాడికి– పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంగా పేర్కొన్నారు. జగనన్న పాలనలో దళారీ వ్యవస్థకు తావులేదని, నేరుగా సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ అందించారని తెలిపారు. అందుకే ప్రజల గుండెల్లో జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే అందుకు జగనన్న పాలన మరోసారి అవసరమన్నారు. అభివృద్ధి గ్యారెంటీ.. బాబు ష్యూరిటీ పేరుతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న చంద్రబాబు నాయుడిని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ హయాంలో తూర్పులో మూడు సార్లు గెలిచిన వెలగపూడి ఈ ప్రాంతానికి ఏం చేశారంటూ ధ్వజమెత్తారు. విశాఖలో ఆయన లిక్కర్ డాన్‌గా పేరుతెచ్చుకోవడం మినహా నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. విశాఖ ఎంపీ , తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే విశాఖ అభివృద్ధి సాధ్యమన్నారు. మరోసారి గెలిస్తే విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు అంతర్జాతీయ నగరంగా విశాఖను అభివృద్ధి చేసేందుకు ఆయన అన్ని చర్యలు తీసుకుంటారన్నారు. విశాఖ అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఓటరు వైఎస్సార్ సీపీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత మరే ముఖ్యమంత్రికి లేదన్నారు. చంద్రబాబు బృందం మోసపూరిత హామీలతో మోసపోవద్దని ఓటర్లకు సూచించారు. వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చే దిశగా బూత్ ఇన్‌చార్జ్‌లు, వార్డు అధ్యక్షులు బాధ్యత తీసుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలన, టీడీపీ స్వార్థపూరిత పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జన్మభూమి కమిటీలు చేసిన అరాచకాలను వెలుగులోకి తేవాలని కోరారు. తద్వారా వైఎస్సార్‌సీపీ అఖండ విజయానికి బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పీవీ నారాయణ, రాజబాబు, 17వ వార్డు ఇన్‌చార్జ్ గేదెల నాగరాజు, మహిళ అధ్యక్షురాలు కృపాజ్యోతి, డైరెక్టర్లు, వార్డ్ ఇన్‌చార్జ్‌లు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల సంక్షేమాన్ని చూసి ఓటేయండి

19వ వార్డులో ఎంపీ ఎంవీవీ విస్తృత ప్రచారం



19వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రజల నీరాజనాలు అందుకుంటూ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. శుక్రవారం 19వ వార్డులో ప్రచారం నిర్వహించారు. శివగణేష్ నగర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలనను వివరించారు. వచ్చే ఎన్నికల్లో తనను తూర్పు ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో ఓటెయ్యాలని కోరారు. సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి చేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంతోనే రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జ్ సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరు అందుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. జీవీఎంసీ 28వ వార్డులో వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ జగనన్న అందించిన సంక్షేమాన్ని గుర్తుపెట్టుకుని తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను గెలిపించాలని కోరారు. కార్యకర్తలతో ప్రతి ఇంటికీ వెళ్లి గడిచిన ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, సంపంగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

‘వెలగపూడి’ పేరు మూసివేత

‘సాక్షి’స్పందన



సామాజిక భవనం బోర్డులో వెలగపూడి పేరుపై అంటించిన పేపర్లు

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి పైనాపిల్‌కాలనీ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సామాజిక భవనం బోర్డుపై ఉన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేరు కనిపించకుండా ఎట్టకేలకు కాగితాలు అంటించారు. ఎన్నికల కోడ్‌లో నిబంధనల ప్రకారం తూర్పు నియోజకవర్గంలో అన్నిచోట్ల శిలాఫలకాలు, రాజకీయ నాయకుల విగ్రహాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బోర్డులు, రాజకీయ నాయకులు పేర్లతో ఉన్న బోర్డులు తదితర వాటిని అధికారులు మూసేయాలి. బాధ్యతలు నిర్వహిస్తున్న సచివాలయం సిబ్బంది నియోజకవర్గంలో 13వ వార్డు పైనాపిల్‌కాలనీ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సామాజిక భవనంపై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేరుతో ఉన్న బోర్డును అలాగే వదిలేశారు. దీనిపై ‘సాక్షి’లో ‘ఇక్కడ ఎన్నికల కోడ్ వర్తించదా’ అనే శీర్షికతో ఈనెల 11న వెలువడిన వార్తకు అధికారులు స్పందించారు. వెంటనే సంబంధిత సచివాలయం సిబ్బందికి అక్షింతలు వేశారు. వారితో ఆ సామాజిక భవనం బోర్డుపై ఉన్న ఎమ్మెల్యే వెలగపూడి పేరు కనిపించకుండా పేపర్లు అంటించారు.

విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సత్కారం



సత్యనారాయణను సన్మానిస్తున్న ఉత్తరాంధ్ర తూర్పు కాపు విద్యార్థి నాయకులు

మద్దిలపాలెం: ఇటీవల జరిగిన విశాఖ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన బెవర సత్యనారాయణను శుక్రవారం పిఠాపురం కాలనీలో పలు సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపకుడు సుంకర రమణమూర్తి, రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమం సంఘం నాయకులు సంయుక్తంగా సన్మానించారు. ఈసందర్భంగా సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ ఘన విజయం సాధించడం అభినందనీయమన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఉత్తరాంధ్రకు చెందిన సత్యనారాయణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికవడం గర్వంగా ఉందని తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు మజ్జి అప్పారావు తెలిపారు. సామాజిక వర్గ బాధితులకు అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు అడ్వకేట్ ఎరుకునాయుడు మాట్లాడుతూ 40 ఏళ్లుగా విశాఖ కోర్టులో ప్రాక్టీస్ చేస్తూ ప్రజల మన్నలు పొందిన గొప్ప వ్యక్తి సత్యానారాయణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో త్రినాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రం ప్రారంభం

- వెయ్యి మందికి ఉపాధి కల్పిన

బీచ్‌రోడ్డు: ఉత్తరాంధ్రతో పాటు కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలకు ఒక్క రోజులో కిరాణా సరకులను డెలివరీ చేసేందుకుగాను ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్ ఫిల్‌మెంట్ కేంద్రాన్ని యలమంచిలి మండలం యర్రవరంలో ప్రారంభించినట్టు సంస్థ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ తెలిపారు. కేంద్రం ప్రారంభోత్సవ వివరాలను మీడియాకు ఆయన తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా రోజుకు 8వేల ఆర్డర్లను డెలివరీ చేయగలగుతామన్నారు. ఇందులో సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ మార్కెట్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే విజయవాడలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇది రెండో కేంద్రమని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా నేరుగా ఉపాధి కల్పించడంతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో కూడా ఉపాధి కల్పినకు దోహదపడతాయన్నారు. ఈ కార్య క్రమంలో హరి కుమార్ పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాన్ని అడ్డుకున్న ఏయూ అధికారులు



ఏయూ స్థలాన్ని ఆనుకుని నిర్మిస్తున్న భవనం

ఏయూ క్యాంపస్: స్థానిక శివాజీపాలెంలోని ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ భవనాలను ఆనుకుని అనధికారికంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను ఏయూ ఇంజినీరింగ్ అధికారులు అడ్డుకున్నారు. ఏయూకు సంబంధించిన స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా భవనాన్ని నిర్మించడాన్ని శుక్రవారం ఏయూ అధికారులు గుర్తించి, నిలిపివేశారు. సదరు భవన నిర్మాణ యజమానిని పిలిచి మాట్లాడారు. భవన నిర్మాణానికి ముందుగా భూమిని సర్వే చేయించాలని, సర్వే ఆధారంగా వారి స్థలంలో మాత్రమే నిర్మాణం జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు మాట్లాడుతూ ఏయూ భూమిని ఆనుకుని ఈ భవన నిర్మాణం చేస్తున్నారన్నారు. దీనికి సంబంధించిన సరిహద్దులను నిర్ణయించకుండా భవన నిర్మాణాన్ని ప్రారంభించడం సరికాదన్నారు. రెండు వారాల క్రితం ఇదే విషయాన్ని తాము భవన నిర్మాణదారుడుకి వివరించామని, దీనిని పెడచెవినపెట్టి భవన నిర్మాణానికి ఉపక్రమించడం సరికాదన్నారు. దీనిని తాము సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నామని తెలిపారు. ఈ ఇదే విషయంపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు స్వయంగా ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు



స్వప్నం రాల్చిన అమృతం నాటికలో సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నాటిక ప్రదర్శనలు శుక్రవారం నుంచి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ప్రారంభమయ్యాయి. ఈ ప్రదర్శనలో తొలి రోజు కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి వారు స్వప్నం రాల్చిన అమృతం నాటికను ప్రదర్శించారు.ద్వితీయ ప్రదర్శనగా కొప్పాలుకు చెందిన పండు క్రియేషన్ వారు పక్కింటి మొగుడు నాటికను అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనలు వీఎండీఏ అధ్యక్ష్య, కార్యదర్శులు ఎంఎస్‌రాజు, రాంబాబు, పైడి కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా ఆచార్య బాబీవర్ధన్ వ్యవహరిస్తున్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి ప్రాధాన్యం

విశాఖ లీగల్ : న్యాయవాదుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. శుక్రవారం విశాఖ న్యాయవాదుల నూతన సంఘ పరిచయ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాన న్యాయమూర్తి గిరిధర్ మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తులు న్యాయ వ్యవస్థకు రెండు కళ్లుగా వివరించారు. కొత్త అధ్యక్షులు బెవర సత్యనారాయణ మాట్లాడుతూ సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

రూ.2 లక్షల నగదు స్వాధీనం

బీచ్‌రోడ్డు: సరైన పత్రాలు లేకుండా తీసుకెళుతున్న రూ.2 లక్షల నగదును ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శుక్రవారం పెదవాల్తేరు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో వచ్చిన కైలాష్ అగర్వాల్ అనే వ్యక్తి కారును తనిఖీ చేసి, అందులో రూ.2 లక్షల నగదును గుర్తించారు. ఈ నగదుకు సంబంధించిన ఎటువంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

మద్దిలపాలెం: 15వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంవీవీ సమక్షంలో భారీగా చేరికలు



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సమక్షంలో 19వ వార్డు జాలరిపేటకు చెందిన 250 మందికి పైగా యువకులు, మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గంపల వెంకట రామచంద్రరావు ఆధ్వర్యంలో శుక్రవారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో వీరు చేశారు. ఈ సందర్భంగా ఎంవీవీ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సంక్షేమ పాలన, అభివృద్ధికి ఆకర్షితులమై, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంవీవీ నాయకత్వంపై ప్రభావితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ వార్డుకు చెందిన పెద్ద ఎత్తున ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరడం హర్షణీయమన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారని చెప్పారు. ఈ ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గోపాలపురం పరిశీలకుడు జి.వెంకటేశ్వరరావు పాటు రామచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాలకు చెందిన మరో 100 మంది

పలు ప్రాంతాలకు చెందిన మరో వంద మంది గంపల రామచంద్రరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీ ఎంవీవీ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆరిలోవ, రామాటాకీస్, కేఆర్ఎం కాలనీ, ఇసుకతోటకు చెందిన యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వచ్చే ఎన్నికల్లో తూర్పులో పార్టీ గెలుపే లక్ష్యంగా సేవలు అందించాలని ఈ సందర్భంగా ఎంవీవీ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గోపాలపురం పరిశీలకుడు జి.వెంకటేశ్వరరావు పాటు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాపురం గురుకులంలో 71.69 శాతం ఉత్తీర్ణత

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం బాలుర గురుకులంలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్‌లో 38 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇక్కడ 2023–24 విద్యా సంవత్సరంలో 53 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 38 మంది(71.69 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వారిలో 32 మంది ఎంపీసీ విద్యార్థుల్లో 27 మంది, 21 మంది బైపీసీ విద్యార్థులలో 11 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో 933 మార్కులుతో పి.చక్రి, బైపీసీలో 738 మార్కులతో బి.ప్రవీణ్ ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 42 మందిలో 28 మంది విద్యార్థులు(66.6 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వారిలో ఎంపీసీ 29లో 19 మంది, బైపీసీ 13 మందిలో 9 మంది ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

నారాయణ విజయభేరి..

సీతమ్మధార: జూనియర్ ఇంటర్ ఎంపీసీలో నారాయణ విద్యార్థులు 465 మార్కులు ఆపైన సాధించారు. గణేష్ కార్తికేయ, పి.ఉధృవ్ కె.ప్రణవ్ సాయి, పి.హర్షవర్ధన్, సి.భరధ్వాజ్, ఎల్.మురళి, జి.శ్రీ సాత్విక్, పి.మహలక్ష్మి, వి.సాయి నికిల్ షాన్ సత్తా చాటారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో లోకేష్ 989, ఎం.తరుణ్ 988, ఎస్.డి.నాయుడు 987, ఎస్‌హెచ్ వర్ధన్, ఎ.అబ్బాస్, ఎం.శ్రీ మణికంత, అబ్దుల్‌భాసిత్ 986, డి.వెన్నెల 986 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో బి.సత్యవేణి 435, ఎం.మానసాదేవి 434, కె.సత్య ఉమా ఈశ్వరి, పూర్ణకుమారి 432 మార్కులు సాధించారు. సీనియర్ బైపీసీలో వి.శ్రీలిఖిత 985, కె.శ్రీ శృతి 982, జోత్స్న 981 మార్కులు సాధించారు. వీరిని డీజీఎం డి.హనుమంతరావు, డీన్ జి.రామలింగేశ్వరావు అభినందించారు.

రేషన్ డీలర్ కుమార్తెకు అధిక మార్కులు



తల్లిదండ్రులతో కాళ్ల ఉమా

మద్దిలపాలెం : ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం బైపీసీలో పాత వెంకోజీపాలెం రేషన్ డీలర్ కుమార్తె కాళ్ల ఉమా 440కిగాను 434 మార్కులు సాధించింది. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు కాళ్ల అప్పలరాజు, పద్మ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా విద్యార్థిని ఉమాకు మిఠాయిలు తినిపించారు. అనంతరం ఉమా మాట్లాడుతూ ఐఐటీ ఎంట్రన్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించాలన్నదే తన లక్ష్యమన్నారు. విద్యార్థినికి గ్రామ సేవాసంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం వర్సిటీ విధానం

- వీసీ ప్రసాద రెడ్డి
- అంబేడ్కర్ చిత్రపటాన్ని మిల్లెట్స్‌తో తీర్చిదిద్దిన విజయ్ కుమార్‌కు అభినందన



మిల్లెట్స్‌తో తీర్చిదిద్దిన అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరిస్తున్న విజయ్ కుమార్

ఏయూ క్యాంపస్: ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం విశ్వవిద్యాలయం విధానమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. నగరానికి చెందిన కళాకారుడు మోకా విజయ్ కుమార్‌ను శుక్రవారం సత్కరించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మిల్లెట్స్‌తో తయారు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని విజయ్ కుమార్ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లకు ఏయూ అంబేడ్కర్ చైర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ కళలో వైవిధ్యతను చూపుతూ, మిల్లెట్స్‌కి ప్రాచుర్యం తీసుకువస్తూ విజయ్ కుమార్ చేస్తున్న కళాసేవ ఎంతో ప్రత్యేకమన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలు విశ్వజనీయమని తెలిపారు. వైవిధ్యత కలిగిన భారత దేశానికి సుదృఢమైన రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అందించారని చెప్పారు. మిల్లెట్స్‌ను ఒక క్రమ పద్ధతిలో అమర్చి అంబేడ్కర్ చిత్రపటాన్ని తీర్చిదిద్దిన విజయ్ కుమార్‌ను అభినందిచారు. వర్సిటీ తరపున సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. వయాట్రిస్ సంస్థ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్స్, సర్వేలెన్స్ రెగ్యులేటరీ హెడ్ డాక్టర్ దేవ పురాణం మాట్లాడుతూ ఇటువంటి ప్రత్యేకమైన కళారూపాలను తయారు చేయడం ఎంతో సంక్లిష్టమైన అంశమన్నారు. ఏయూ ఇటువంటి కళలకు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చిత్రకారుడు మోకా విజయ్ కుమార్‌ని అభినందించారు.

ఐక్యరాజ్యసమితిలో హిందీని అధికార భాషగా చేసేందుకు కృషి

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్



ప్రసంగిస్తున్న ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

ఏయూక్యాంపస్: ఐక్యరాజ్యసమితిలో హిందీని అధికార భాషగా చేయడానికి తాము కృషిచేస్తున్నామని విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఏయూ హిందీ విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వవ్యాప్తంగా హిందీ భాషను వ్యాప్తి చేయడంతో పాటు స్థానిక భాషల వికాసానికి కృషిచేస్తున్నామన్నారు. త్రిభాషా సూత్రం ప్రకారం ఉత్తర భారతీయులు, దక్షిణ భారతీయుల ఒక భాషను నేర్చుకోవాలని సూచిస్తున్నట్టు చెప్పారు. స్థానికంగా మాతృభాషను, జాతీయ స్థాయిలో హిందీని నేర్చుకోవాలని తాము ప్రోత్సహిస్తున్నామన్నారు. మిగతా దేశాలలో భారతీయులకు ప్రాధాన్యత పెరుగుతోందని తెలిపారు. వీరి సహకారం తీసుకుని ఐక్యరాజ్య సమితిలో హిందీని అధికార భాషగా చేర్చే దిశగా పనిచేస్తున్నామన్నారు. విశ్వ హిందీ పరిషత్ కార్యదర్శి బిపిన్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ శాంతిని కాంక్షించేది భారతీయ సంస్కృతన్నారు. ప్రాంతీయ భాషలు, రాష్ట్రభాష పటిష్టం చేసే దిశగా పనిచేస్తున్నామన్నారు. విదేశాలలో హిందీని చేరువ చేస్తున్నామన్నారు. తద్వారా విదేశీయులు మరింత మెరుగైన అవగాహను భారతీయ సంస్కృతిపై పెంపొందించుకోవడం సాధ్యపడుతుందన్నారు.